క్లుప్తంగా

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ఉండి సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు

ఉండి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఉండి సెంటర్‌లో ఓట్ల లెక్కింపుపై మరియు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జరిగే పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ వెలువడనున్న ఎన్నికల ఫలితాల దృష్ట్యా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సిబ్బంది, ఏజెంట్లకు తప్ప ఇతరులు కౌంటింగ్ కేంద్రానికి వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. అలాగే కౌటింగ్ సమయంలో, ఫలితాలు వెలువడిన సందర్భంలో సంబరాలు, ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి లేదన్నారు. ఎన్నికలకు శాంతియుతంగా సహకరించిన అన్ని పార్టీల వారు కౌటింగ్ సమయంలోను సహకరించాలని కోరారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

కార్మిక చట్టం వర్తింపజేయాలి



సమావేశంలో పాల్గొన్న రైస్‌మిల్లు కార్మికులు

ఆకివీడు: రైస్‌మిల్లు కార్మికులకు కనీస వేతన చట్టం, కార్మిక చట్టాల్ని వర్తింపజేయాలని రైస్ మిల్లు కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బీ.వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో రైస్‌మిల్లు కార్మికుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాల్ని సవరించి పదేళ్లు గడుస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, వెంటనే జీవో విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్షులు జేఎన్వీ. గోపాలన్, మండల అధ్యక్షకార్యదర్శులు పెంకి అప్పారావు, తవిటి నాయుడు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం



కొల్లాబత్తుల రవికుమార్

మొగల్తూరు: రాష్ట్రంలోని ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని మాజీ ఏఎంసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొల్లాబత్తుల రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో పాటు కేంద్రంలో మన ఎంపీలు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నరసాపురం ఎమ్మెల్యేగా ముదునూరి ప్రసాదరాజు, ఎంపీగా గూడూరి ఉమాబాలలు విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందించాలంటే జగనన్నే విజయం సాధించాలని వివరించారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజాభిప్రాయం మేరకే ఎగ్జిట్ పోల్స్

పెనుగొండ: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించబోతుందని ఎగ్జిట్ పోల్స్ ప్రజాభిప్రాయన్ని తేల్చి చెప్పాయని ఏపీఈడబ్ల్యూడీసీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి కొవ్వూరి వేణుమాధవరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 4న వెల్లడయ్యే వాస్తవ ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయన్న ధీమాను వ్యక్తం చేశారు. సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో మహిళలను సమాజంలో ఆత్మగౌరవంతో నిలబెట్టారని పేర్కొన్నారు. సీఎం జగన్ వల్లే మేలు జరుగుతుందని మహిళలు విశ్వాసంతో పోలింగ్‌కు తరలి వచ్చి ఓటు వేశారని వివరించారు.

పోలీసుల సేవలు అభినందనీయం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్



పేరేడ్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ అజిత వేజెండ్ల

భీమవరం: ఆదివారం జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద కేంద్ర, రాష్ట్ర బలగాలతో నిర్వహించిన పెరేడ్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్, ఎస్పీ అజిత వేజెండ్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ వారిని ఉద్దేశించి మాట్లాడారు. రెండు నెలలుగా జిల్లాలో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతియుతంగా ఎన్నికలు పూర్తి కావడానికి పోలీసుల సేవలు అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో కౌంటింగ్ కూడా ప్రశాంతంగా పూర్తవడానికి నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కోరారు. పోలీస్ అధికారులు, సిబ్బంది సేవలు శాంతి భద్రతల పరిరక్షణకు దోహదపడ్డాయన్నారు. కౌంటింగు పూర్తయినా మరో రెండు రోజులపాటు పోలీసులకు కేటాయించిన ప్రాంతాలలో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రజలకు భరోసా కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ పోలీసులు నిరంతరం విధులలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎటువంటి లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తినా జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలన్నారు. అనంతరం అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వరకు నిర్వహించిన కవాతులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు సుమిత్ కుమార్, ఎస్పీ అజిత వేజెండ్ల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, అదనపు ఎస్పీ వి.భీమారావు, పలువురు డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది ఉన్నారు.

రావిపాడు సమస్యను పరిష్కరించాలి

భీమవరం: పెంటపాడు మండలం రావిపాడులోని స్థల వివాద సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ఆదివారం దళిత సంఘం నాయకులు చింతపల్లి గురుప్రసాద్, భరత్‌కుమార్, బాలకృష్ణ, త్రిమూర్తులు, అశోక్, నాగేశ్వరరావు, రామరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దళితులపై దాడిని ప్రేరేపించిన తాడేపల్లిగూడెం సీఐ రమేష్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రావిపాడులో ఖాళీగా ఉన్న ఇరిగేషన్‌శాఖకు చెందిన స్థలంలో కొంత కాలంగా దళితులు అంబేడ్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించుకుంటూ కమ్యూనిటీ స్థలంగా వాడుకుంటున్నారన్నారు. అగ్రకులస్తుడైన మిలిటరీమేన్ నాగేశ్వరరావుకు ఇంటిస్థలం కేటాయించాలని చేసుకున్న దరఖాస్తుకు వేరే ప్రాంతంలో ప్రభుత్వం స్థలం కేటాయిస్తే దళితులు వినియోగించుకుంటున్న భూమిలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టారన్నారు. రావిపాడు వివాదంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజుతో పాటు దళితులపై అక్రమంగా కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు. అక్రమంగా ఇంటి నిర్మాణం చేయిస్తున్న మిలటరీ ఉద్యోగి భార్యకు పోలీసు, రెవెన్యూ అధికారులు మద్దతివ్వడం దారుణమన్నారు. రావిపాడు సంఘటనపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి అక్రమ కేసులను తొలగించి దళితులకు న్యాయం చేయాలని కోరారు. గ్రామంలో దళితులకు అగ్రవర్ణాలవారు కౌలుకి ఇచ్చిన భూములను తిరిగి తీసుకుంటున్నారని, నిత్యావసర సరుకులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థల వివాద ఘటనపై సీబీడీతో విచారణ జరిపిస్తే నిజాలు బయటికి వస్తాయన్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించకపోతే ఈ నెల 6న ఎస్సీ, ఎస్టీ చట్టపరంగా చర్యలకు దిగుతామని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి

ఆకివీడు: మండలంలోని దుంపగడప శివారు ఉప్పుటేరు వద్ద పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బత్తిన నాగబాబు ఆదివారం తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

పోలీసుల అదుపులో రౌడీషీటర్‌లు

ఉండి: ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఉండి, ఎన్నార్పీ అగ్రహారం గ్రామాలకు చెందిన ఇద్దరు రౌడీ షీటర్లను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగేందుకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నట్లు ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు.

'పది' ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకం



బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులు

భీమవరం: పట్టణం, రూరల్, వీరవాసరం, పాలకోడేరు, ఉండి, ఆకివీడు మండలాలలోని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్థానిక యుటీఎఫ్ కార్యాలయంలో బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నగదు ప్రోత్సాహకాలను అందించారు. బాలోత్సవం కమిటీ అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను మెరుగుపరిచేందుకు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే వీరవాసరం మండలం రాయకుదురు, భీమవరం పట్టణం జేఎల్‌బీ హైస్కూల్, శృంగవృక్షం, ఆకివీడు బాయ్స్ హైస్కూల్స్, ఉండి మండలం యండగండి ప్రభుత్వ హైస్కూల్, భీమవరం మండలం కొవ్వాడ, కాళ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులకు అవార్డులు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎంఆర్.రాజు, వసుధ ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, బాలోత్సవ కమిటీ కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య, ఉపాధ్యక్షుడు గాతల జేమ్స్, కోశాధికారి పి.సీతారామరాజు, యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, చెరుకువాడ రంగసాయి, బుద్ధరాజు వెంకటపతిరాజు, అల్లు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం



రాయకుదురు ఆలయంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: మావుళ్లమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజుస్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ ఆకాంక్షించారు. మండలంలోని రాయకుదురు మావుళ్లమ్మ, మహాలక్ష్మి, పోతురాజుస్వామి ఆలయాన్ని ఆదివారం దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలన్నారు. మరలా వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కొణితివాడలో వేణుగోపాల స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ మానుకొండ ప్రదీప్ కుమార్, నాగరాజు వెంకట శ్రీనివాస రాజు, గన్నవనీడి బాబ్జీ, తాడాల దుర్గా వరప్రసాద్, నాగరాజు వెంకట గోపాలకృష్ణంరాజు, వై.మధురాజు, వై.వెంకట్రామరాజు, ఎస్.సత్యనారాయణరాజు, గోపాలకృష్ణ, అడబాల రామకృష్ణుడు, సింహాద్రి సాయి రాజేష్, కాకిలేటి బాసు, మారెళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ రెండోసారి సీఎం అవ్వడం ఖాయం

కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు



శ్రీనివాసరాజు

కాళ్ల: రాష్ట్రంలో రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవటం ఖాయమని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక సీట్లతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపడుతున్నారని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు, మహిళలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో అవినీతికి తావు లేకుండా అన్ని వర్గాలకు సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర తిరగరాస్తారన్నారు. వృద్ధులు పెన్షన్‌దారులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉన్నారని స్పష్టం చేశారు. మరొకసారి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే సంక్షేమ పథకాలు ఆగకుండా అవినీతికి తావులేకుండా అర్హులందరికీ అందుతాయని ప్రజలు నమ్మకంతో ఫ్యాన్ గుర్తుకు ఓటేశారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని తెలియజేశారు.

పాలకోడేరులో భారీ వర్షం



పాలకోడేరులో కురుస్తున్న వర్షం

పాలకోడేరు: మండలంలో ఆదివారం ఒక్కసారిగా వాతావరణం మారి భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. మూడు రోజుల నుంచి విపరీతమైన ఎండలతో పగటిపూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల పైన దాటడంతో ప్రజలు అల్లాడిపోయి బయటికి రావాలంటేనే బెంబేలెత్తిపోయారు. ముఖ్యంగా పాలకోడేరు మండలం మోగల్లు, శృంగవృక్షం, పెన్నాడ, వేండ్ర తదితర గ్రామాల్లో సుమారు గంటసేపు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. ప్రయాణికులు, వాహనదారులు రోడ్ల పక్క షాపులోనికి పరుగులు తీశారు. ఏది ఏమైనా వడగాడ్పులకు అల్లాడిన జనానికి భారీ వర్షం కొంత ఉపశమనం కలిగించింది.

వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరు



తూర్పుపాలెంలో కౌంటింగ్ ఏజెంట్లు శిక్షణలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలోనూ, ఆచంట నియోజకవర్గంలోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధించబోతుందని మాజీ మంత్రి, ఆచంట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు, ఆదివారం తూర్పుపాలెంలో కౌంటింగ్ ఏజెంట్లు శిక్షణలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నమ్మకాన్ని నిలబెడుతూ 4న రాష్ట్ర ప్రజలు తీర్పు చెప్పబోతున్నారన్నారు. 155కుపైగా నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించబోతుందన్నారు. రాష్ట్రంలో అమ లు చేసిన సంక్షేమానికి మహిళలు సైలెంట్‌గా ఓటుతో కృతజ్ఞతలు తెలిపారన్నారు. ఎన్నికల్లో సీఎం జగన్ చేసిన మంచికి ఓటు వేయాలంటూ ప్రచారం నిర్వహించారన్నారు. దీనికి భిన్నంగా చంద్రబాబు ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తూ ప్రచారం చేశారన్నారు. దుష్ప్రచారం, కుయుక్తులపైనే చంద్రబాబు, జనసేన నాయకులు నమ్మకం పెట్టుకున్నారన్నారు, ఎందరూ కూడగట్టుకొని వచ్చి నా సీఎం జగన్ విజయాన్ని ఆపలేకపోయారన్నారు. దీనికి ఉదాహరణ ప్రధాన సర్వేలన్నీ వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టబోతుందని తేల్చి చెప్పాయన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ విజయం సాధించబోతున్నామన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, మద్దతు దారులు సైలెంట్‌గా ఉన్నారన్నారు. టీడీపీ అత్యుత్సాహం ప్రదర్శిస్తుందన్నారు. వారి నాటకాలు నమ్మాల్సిన అవసరం లేదన్నారు. ఆచంటలోనూ అత్యంత మెజార్టీతో గెలవబోతున్నామన్నారు. 9న సీఎం జగన్ ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని తేల్చి చెప్పారు. పెనుమంట్ర ఎంపీపీ కేవీఎస్ నారాయణ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కేన్సర్ రోగికి వసుధ సహాయం

పాలకొల్లు అర్బన్: వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు ఆదేశాల మేరకు వడ్లవానిపాలెంకి చెందిన క్యాన్సర్ రోగి కొక్కిరిగడ్డ జ్యోతికి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, కె.జాన్ చేతుల మీదుగా రోగికి అందజేశారు.

మైనర్ డ్రెయిన్ల మరమ్మతులు చేపట్టాలి

రైతు కార్యాచరణ సమితి నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న రైతు కార్యాచరణ సమితి నాయకులు

భీమవరం: సార్వా వరిసాగు సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో మైనర్ డ్రెయిన్ల మర్మతులపై దృష్టి పెట్టాలని రైతు కార్యాచరణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు పాతపాటి మురళీరామరాజు, తమ్మినీడి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత ఏడాది అధిక వర్షాల కారణంగా మురుగు కాలువలు పూడుకుపోయి నారుమళ్ల సమయంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. మురుగు నీటిపారుదల శాఖాధికారులు మైనర్ డ్రెయిన్ల మరమ్మతులకు తగు చర్యలు తీసుకుని, ఉపాధి హామీ పథకంలోనైనా పనులు పూర్తి చేయాలని మురళీరామరాజు, నాగేశ్వరరావు కోరారు. అలాగే రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి డ్రెయిన్ల మరమ్మతులకు కృషి చేయాలని కోరారు. డ్రెయిన్ల మరమ్మతుల్లో ఆలస్యం జరిగితే నారుమళ్లు మునిగిపోయి నాట్లు వేయడానికి తీవ్ర జాప్యం కలిగి, పంట నష్టపోతామని వివరించారు. మురుగు నీటిపారుదల అధికారులను సంప్రదించి మైనర్ డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క వంటివి తొలగించడానికి కెమికల్స్‌ను పిచికారి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలు, డ్రెయిన్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందున కలెక్టర్ సుమిత్‌కుమార్ త్వరితగతిన పనులు చేపట్టే విధంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో రైతు కార్యాచరణ సమితి నాయకులు కలిదిండి గోపాలకృష్ణంరాజు, కె.కమలాకరశర్మ, ఎం.కృష్ణంరాజు, గొట్టుముక్కల వెంకట భీమరాజు, దండు సత్యనారాయణరాజు, దాసరి సత్యనారాయణ, కోరుకొల్లు మురళీరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయపాలన పాటించాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న లయన్స్ ప్రతినిధి నెల్లి సతీష్



వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న చిన్నారులు

ఆకివీడు: విద్యార్థులు సమయపాలన పాటిస్తే మంచి భవిష్యత్ చేకూరుతుందని లయన్స్ ప్రతినిధి నెల్లి సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక మాదివాడలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు 789 నెంబర్‌ను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఈ సంఖ్యల్ని కూడితే 24 వస్తుందని అవి గంటలుగా భావించి, 7 గంటలు విశ్రాంతి, నిద్రపోవాలని, 8 గంటలు విద్యపై దృష్టి పెట్టాలని, 9 గంటలు ఆటలు, పాటలు, చిత్రలేఖనం, స్నేహితులతో మాట్లాడటం వంటి వాటిని అలవర్చుకోవాలన్నారు. 789 ఫార్ములాను పాటిస్తే విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థితికి చేరి, దేశం గర్వించే పౌరులవుతారని తెలిపారు. కార్యక్రమంలో రీడర్స్ ఫోరం ప్రతినిధులు, శిక్షకులు, గ్రంథాలయ నిర్వాహకురాలు పార్వతి పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

కాళ్ల: మండలంలోని స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ బండారు దుర్గాప్రసాద్ ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు నైతిక విలువలు, విద్యాభివృద్ధికి దోహదం చేసే అంశాలు తెలియజేశారు. టైం మేనేజ్మెంట్ పరీక్షలకు ప్రత్యేక సదస్సు నిర్వహించి, మెరిట్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో ఉద్యోగి పాత్ర కీలకం



పంచాయతీ కార్యదర్శి సాత్వీకంను సత్కరిస్తున్న సర్పంచ్ వెంకటసోమరాజు

ఉండి: గ్రామాభివృద్ధిలో ఉద్యోగి పాత్ర కీలకమని చిలుకూరు సర్పంచ్ ముదునూరి వెంకట సోమరాజు అన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సాత్వీకం ఇటీవలె చిలుకూరు నుండి బదిలీపై కాళ్ల మండలం కలవపూడి వెళ్లిన కార్యదర్శిని, జూనియర్ అసిస్టెంట్ రాజేష్‌ను సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిలుకూరు పంచాయతీ కార్యదర్శిగా గ్రామాభివృద్ధికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రజల ముందుకు సమస్య రాకముందే పంచాయతీ పాలకవర్గం దృష్టికి తెచ్చి పరిష్కరించే వారని కొనియాడారు. త్రాగునీరు, విద్యుత్, పారిశుధ్యంపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించారన్నారు. విధి నిర్వహణలో మరింత ముందుకు వెళ్లి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శి సాత్వీకం మాట్లాడుతూ చిలుకూరు తనకు సొంత గ్రామంలా మారిపోయిందన్నారు. ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లడం బాధాకరంగా వున్నా విధి నిర్వహణలో ఇవన్నీ తప్పనిసరి అని ఆమె అన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రుద్రరాజు పరమేశ్వరరాజు, మాజీ ఉపసర్పంచ్ కూనపరాజు రామకృష్ణంరాజు, వేగేశ్న దిలీప్‌రాజు, పేరిచర్ల శ్రీనివాసరాజు, వీఆర్వో విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటిక పోటీలు



'స్వప్నం రాల్చిన అమృతం' నాటికలో సన్నివేశం

భీమవరం: పట్టణంలోని డీఎన్నార్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో చైతన్య భారతి సంగీత, నృత్య, నాటిక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటిక పోటీలు నాల్గో రోజు ఆసక్తికరంగా సాగాయి. ఆదివారం కరీంనగర్ చైతన్యభారతి ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక కాకుల్లో ఉన్న జ్ఞానం మనుషుల్లో లేకపోతే ఎలా అనే ఇతివృత్తంతో సాగింది. పీఎస్.నారాయణ మూల కథను అందించగా మంచాల రమేష్ దర్శకత్వంలో నటులు అద్భుతంగా నటించారు. ఒక కాకికి దెబ్బతగిలి కిందపడితే మరికొన్ని చుట్టూ చేరి కావు కావు మంటూ అరుస్తాయి. వాటి మధ్య ఎటువంటి సంబంధాలు లేకపోయినా సాటి కాకులుగా గొప్ప సానుభూతిని చూపిస్తాయి. భార్య, భర్తల బంధానికి, అనుబంధానికి విలువనిచ్చే మనుషులు ఇతరులపై సానుభూతిని చూపించలేకపోతున్నారంటూ స్వప్నం రాల్చిన అమృతం ప్రదర్శించి ప్రేక్షకులను కంటతడి పెట్టించారు. రెండో ప్రదర్శనగా ఇబ్రహీంపట్నం వీటీపీఎస్ కల్చరల్ అసోసియేషన్ ప్రదర్శించిన 'ఎనిమి' నాటిక నేటి సమాజంలో విద్యార్థులు, యువతుల ఫొటోలు మార్ఫింగ్ చేసి, సెల్‌ఫోన్స్‌తో ఎలా బ్లాక్‌మెయిల్ చేస్తున్నారనే విషయాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. పదో తరగతి చదువుతున్న కావ్య, శ్రావ్యలు పోకిరీల బారిన పడి ఎలా ఇబ్బందులు పడ్డారనే విషయాన్ని ఇతివృత్తంగా ప్రదర్శించారు. నాటికలను చైతన్య భారతి అధ్యక్ష, కార్యదర్శులు రాయప్రోలు భగవాన్, మంతెన రామకుమార్‌రాజు, బొండా రాంబాబు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, పేరిచర్ల లక్ష్మణవర్మ పర్యవేక్షించారు.